నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 17 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

లగచర్ల రైతులపై ప్రభుత్వ వేధింపులకు నేడు బీఆర్ఎస్ నిరసన

- అంబేద్కర్ విగ్రహాలకు వినతులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 16 : ఫార్మాసిటీకి భూములు ఇవ్వనందుకు లగచర్ల రైతులను వేధింపులకు గురి చేసి జైలుపాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు భువనగిరి బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరు మారాలని, సీఎం రేవంత్‌రెడ్డి మనసు మారాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 11 గంటలకు నిర్వహించే నిరసన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లా నాయకులు, మండల, పట్టణ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కుటుంబ సభ్యులు

గాదరి కిశోర్‌కు మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

తిరుమలగిరి, డిసెంబర్ 16 : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కుటుంబ సమేతంగా కలిశారు. ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా కిశోర్ కలిశారు. కేసీఆర్, కేటీఆర్ కిశోర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అపర భగీరథుడికి క్షీరాభిషేకాలు

- జిల్లాలో కాళేశ్వరం జలాల పరవళ్లు
- నీటి విడుదలతో కాల్వల ద్వారా చెరువుల్లోకి నీళ్లు
- 16వ ప్యాకేజీలోని ఓటీ 1, 2 ద్వారా ఆలేరుకు జలాలు
- 2019లోనే ఆలేరుకు గోదావరి నీళ్లు
- కానీ.. తామే నీళ్లు తెచ్చామంటున్న కాంగ్రెస్ నేతలు
- అవి ఎస్సారెస్పీ నీళ్లు అంటూ అబద్ధపు ప్రచారం
- ఏడాదిలోనే ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్న రైతన్నలు

మాజీ సీఎం కేసీఆర్‌ను కొలుస్తున్న రైతులు, ప్రజలు

కరువుతో అల్లాడిన ఆలేరు నియోజకవర్గానికి కాళేశ్వరం జలాలు తీసుకురావాలన్న మాజీ సీఎం కేసీఆర్ సంకల్పం సాకారమైంది. ప్రాజెక్టు నిర్మించిన తర్వాత వరుసగా నీటిని విడుదల చేస్తుండడంతో చెరువులు నిండి జలకళ సంతరించుకుంటున్నాయి. ఈ ఏడాది కూడా నీళ్లు రావడంతో రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు ధోకా లేదని హర్షిస్తున్నారు. ఈ సందర్భంగా అపర భగీరథుడు కేసీఆర్ ఫ్లెక్సీలకు రైతులు, ప్రజలు క్షీరాభిషేకాలు చేపడుతున్నారు. కాళేశ్వరం జలాలతో నిండుతున్న చెరువులు సీఎం కేసీఆర్ పుణ్యమే అని చెబుతున్నారు.

– యాదగిరిగుట్ట, డిసెంబర్16

మోటకొండూర్ మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న రైతులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు (ఫైల్)

ఏడు మండలాలు..110 చెరువులు..

కాళేశ్వరం ప్రాజెక్టు 15, 16వ ప్యాకేజీ నిర్మాణాలు యాదాద్రి భువనగిరి జిల్లాకు సాగునీటిని అందించే లక్ష్యంగా జరిగాయి. 16వ ప్యాకేజీలో భాగంగా నిర్మితమైన నృసింహ స్వామి జలాశయంలోకి 2022లోనే 1.0 టీఎంసీ నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి యేటా నీటిని జలాశయాన్ని నింపుతూ చెరువుల్లోకి వదులుతున్నారు. పంటల సాగు కోసం వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 16వ ప్యాకేజీ ప్రధాన కాల్వ ఓటీ 1, 2 కాల్వల ద్వారా నీటిని విడుదల చేయగా చెరువుల్లోకి కాళేశ్వరం జలాలు చేరుకుంటున్నాయి. యాదగిరిగుట్ట, మోటకొండూర్, ఆలేరు, తుర్కపల్లి, బొమ్మలరామారం, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాలతోపాటు పలు ప్రాంతాల్లోని సుమారు 110 చెరువులు నిండుతున్నాయి. దాంతో రైతులు సంబుర పడుతున్నారు.

2019లోనే ఆలేరును తాకిన గోదారమ్మ

రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో తొలిసారిగా 2019 సెప్టెంబర్ 23వ తేదీన ఆలేరు నియోజకవర్గానికి గోదావరి జలాలు వచ్చాయి. దేవదాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా నవాబ్‌పేట జలాశయం ప్రధాన కాల్వ వద్ద గుండాల మండలానికి మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి నాలుగేండ్లుగా విడుతల వారీగా గోదావరి జలాలు మండలానికి వస్తూనే ఉన్నాయి. మొత్తం 36 చెరువులు నిండి 31 వేల ఆయకట్టుకు సాగు జలాలు అందాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం లింక్ 4, ప్యాకేజీ 14లో భాగంగా కొండపోచమ్మ సాగర్ జలాశయంలోని జగదేవపూర్ ప్రధాన కాల్వ క్రాస్ రెగ్యులేటర్ 3.5 కిలోమీటర్ల వద్ద తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు సుమారు 1,496.24 ఎకరాలకు సాగు నీళ్లు అందుతుండడంతో పంటలకు ధోకా లేకుండా పోయింది. జగదేవపూర్ ప్రధాన కాల్వ క్రాస్ రెగ్యులేటర్ 50 కిలోమీటర్ల వద్ద ప్రారంభమైన మరో జల ధార ఎం. తుర్కపల్లి ప్రధాన కాల్వతో తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లో 1,058.94 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటి సమస్య తీరింది.

కాంగ్రెస్ విష ప్రచారం

ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాత్రం తామే గోదావరి జలాలు తీసుకొచ్చామని విష ప్రచారానికి పూనుకుంటున్నది. కాళేశ్వరం పేరుకు బదులు ఎస్ఆర్ఎస్పీ ద్వారా నీటిని విడుదల చేస్తున్నామని చెబుతూ ఇటీవల ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కరప్రతాలను సైతం పంపిణీ చేశారు. దీనిపై రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. 2019లోనే మొదటిసారిగా ఆలేరు నియోజకవర్గానికి గోదావరి జలాలు వచ్చాయని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతియేటా నీళ్లు వస్తున్నదని నిజం కాదా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నారు. నీళ్లు తీసుకొచ్చిన కేసీఆర్‌పై విష ప్రచారం చేయడం తగదని అంటున్నారు.

13 డిస్ట్రిబ్యూటరీ కాల్వలు

బస్వాపూర్‌లో నీటిని దిగువ భాగానికి మళ్లించేందుకు ప్రధాన కాల్వతోపాటు ఆయా ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, మైనర్, సబ్ మైనర్ కాల్వలను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించింది. మొత్తం 13 డిస్ట్రిబ్యూటరీ కాల్వల(ఆఫ్‌టెక్)ను ఏర్పాటు చేసింది. ఈ కాల్వల ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు సాగు నీళ్లు అందించే లక్ష్యం పనులు పూర్తయ్యాయి. ప్రధానంగా మేజర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ఆఫ్‌టెక్–1 ద్వారా తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో 2,576 ఎకరాల ఆయకట్టు, ఆఫ్‌టెక్–2 ద్వారా యాదగిరిగుట్ట, మోటకొండూర్, భువనగిరి మండలంలోని బస్వాపూర్, ఆత్మకూరు(ఎం), ఆలేరు, గుండాల మండలాల్లో 47,722 ఎకరాలకు కాళేశ్వరం జలాలు విడుదల చేసే వీలుంది. బీఆర్ఎస్ హయాంలో విస్తారంగా వర్షాలు కురువడంతోపాటు చెరువుల్లో సమృద్ధిగా నీళ్లు ఉండటంతో కాళేశ్వరం జలాల అవసరం అంతగా రాలేదు. కానీ తాజాగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఓటీ కాల్వల ద్వారా గోదావరి జలాలు చెరువుల్లోకి విడుదల చేయగా సుమారు 110 చెరువులు నిండుకుండలామారాయి.

2019లోనే గోదావరి జలాలు తెచ్చి చూపాం

60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఆలేరు బీడు బారింది. చుక్క నీళ్లు లేక రైతులు వలసబాట పట్టారు. నాటి పాలకులకు ఏనాడూ సాగు జలాలు అందించాలన్న ఆలోచన రాలేదు. రాష్ట్రం ఏర్పాటుతో సీఎం కేసీఆర్ సాగు జలాలను అందించాలన్న లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. అక్కడి నుంచి దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా నవాబ్‌పేట జలాశయం నుంచి 2019లోనే గోదావరి జలాలను గుండాలకు అందించాం. కొండపోచమ్మ సాగర్ జలాశయంలో భాగంగా నిర్మితమైన మన్నెవారి తుర్కపల్లి, తుర్కపల్లి ప్రధాన కాల్వల ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు సాగు జలాలు అందించాం. అధికారంలోకి వచ్చి ఏడాదిలోనే తట్టెడు మట్టి ఎత్తని ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే మేమే నీళ్లు తీసుకొచ్చామని చెప్పడం హాస్యాస్పదం. ఈ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేని ఎస్ఆర్ఎస్పీ కాల్వ ద్వారా నీళ్లు అందిస్తున్నామని ప్రచారం చేయడం అవగాహనలేమి. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు లేకుండా చేయాలన్న కాంగ్రెస్ పార్టీ కుట్రను రైతులే తిప్పి కొట్టడం ఖాయం.

- గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ముమ్మాటికీ కేసీఆర్ పుణ్యమే

అధికారంలోకి వచ్చి ఏడాదిలోపే మాయ చేసి సాగు జలాలు అందించామని కాంగ్రెస్ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నరు. కాల్వ తీయలె. చెరువు బాగు చేయలె. ఒక్క రిజర్వాయర్ కట్టలె. అయినా మేమే తీసుకొచ్చామని చెబితే నమ్మే పరిస్థితి లేదు. రైతు బిడ్డలా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన చేసిండు. నీటిని అందించాలన్న గొప్ప సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిండు. అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టు ఒక కమీషన్ల ప్రాజెక్టని, అక్కడిని నుంచి నీళ్లు తీసుకురావడం కష్టమని ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులే ఇప్పుడా నీళ్లనే చెరువుల్లోకి మళ్లిస్తున్నరు. ఎవరెన్ని మాట్లాడినా కేసీఆర్ చేసిన పుణ్యంతోనే చెరువుల్లోకి కాళేశ్వర జలాలు వచ్చాయి.

-వంటేరు ఇంద్రసేనారెడ్డి, రైతు, మాసాయిపేట, యాదగిరిగుట్ట మండలం

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కమిషన్ పేరుతో కాంగ్రెస్ సర్కారు కాలయాపన

- సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాలుకల ధోరణి సరికాదు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, డిసెంబర్ 16 : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కట్టంగూర్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు 30 సంవత్సరాల పాటు సుదీర్ఘపోరాటం చేశారని, ఎంతో మంది తమ జీవితాలను త్యాగం చేశారని తెలిపారు. రాజ్యాంగం ద్వారా అందాల్సిన ఫలాలు సక్రమంగా అందడం లేదని చేస్తున్న పోరాటం ప్రపంచ చరిత్రలో ఇంతపెద్ద ఉద్యమం ఎప్పుడూ జరుగలేదన్నారు. కులగణన ఆధారంగా మాదిగలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు దళిత సంఘాల నాయకులను వర్గీకరణ కోసం ఢిల్లీకి తీసుకెళ్లారని గుర్తు చేశారు. వర్గీకరణ కోసం బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించారని తెలిపారు. మాల, మాదిగలు ఒకరిని మరొకరు నిందించుకునే విధంగా ఉండొద్దని, అందరూ కలిసి ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారని చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వర్గీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా కాంగ్రెస్ నాయకులు మాత్రం కమిటీలు, ప్రకటనలతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మాలలను రెచ్చగొట్టే ప్రయ త్నం చేస్తున్నదని ఆరోపించారు. ఆర్టికల్ 14 ప్రకా రం ఆ యా రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా అన్ని రా ష్ట్రాలకంటే ముందే తెలంగాణలో వర్గీకరణ చేసిన తరువాతే ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి పాత రిజర్వేషన్ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని విమర్శించారు. కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాలుకల ధోరణితో మాలలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జరుగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ విషయమై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ మోసంతో 1.30 లక్షలు మాయం

వీడియో కాల్ చేసి క్రెడిట్ కార్డు డిటైల్స్ తెలుసుకున్న నేరగాడు

సైబర్ నేరగాడి చేతిలో మోసపోయి డబ్బులు డ్రా చేసిన స్టేట్‌మెంట్‌ను చూపిస్తున్న బాధితుడు సురేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), డిసెంబర్16 : సైబర్ నేరగాడి మోసానికి ప్రభుత్వ ఉద్యోగి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.30 లక్షలు మాయమైన ఘటన ఆత్మకూరు(ఎం)లో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.సురేందర్‌రెడ్డికి నవంబర్22న గుర్తు తెలియని సైబర్ నేరగాడు 7047182015 ఫోన్ నంబర్ ద్వారా వాట్సాప్ వీడియో కాల్ చేసి మీరు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు కదా అని అడుగగా సురేందర్‌రెడ్డి అవును అని సమాధానం ఇచ్చాడు. క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు ఫారాన్ని తప్పుగా నింపారంటూ...సైబర్ నేరగాడు చెప్పడంతో పాటు వీడియోకాల్ మాట్లాడుతూనే తానే స్వయంగా తమ దరఖాస్తును కరెక్టుగా మళ్లీ నింపుతున్నానని నమ్మబలికాడు. సురేందర్‌రెడ్డిని ఆధార్‌కార్డు నంబర్ చెప్పమని అడుగగా వెంటనే చెప్పాడు. ఇదే అదునుగా సైబర్ నేరగాడు తనకు ఏబ్యాంక్ లోనైనా క్రెడిట్ కార్డు ఉందా అని అడుగగా ఉందని సమాధానం చెప్పాడు. ఇండస్‌ఇండ్ బ్యాంక్ కార్డు ఉందని తెలుపగానే వీడియో కాల్‌లో చూపించమని సైబర్ నేరగాడు కోరగా ఆ కార్డును చూపించాడు. వెంటనే బ్యాంక్ ఖాతా నుంచి రూ.20వేలు డ్రా చేసినట్లుగా బాధితుడికి మెసేజ్ రావడంతో ఆందోళన చెందాడు. మరో అరగంటలోపే 8సార్లు క్రెడిట్ కార్డు ద్వారా మొత్తం రూ.1.30లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చిందని బాధితుడు తెలిపాడు. వెంటనే ఎల్‌బీనగర్ సైబర్ పోలీస్‌లకు ఫోన్ ద్వారా ఫిర్యాధు చేయగా రూ.1.50లక్షలకు పైబడి మోసపోతేనే కేసు నమోదు చేసుకుంటామని, అంతకన్నా తక్కువ డబ్బులు మోసపోతే స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనే ఫిర్యాధు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. వెంటనే ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌లో మోసపోయిన విషయాన్ని తెలిపి ఫిర్యాధు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య సోమవారం తెలిపారు.



కంపసాగర్ మోడల్ స్కూల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

త్రిపురారం, డిసెంబర్ 16: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని కంపసాగర్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా పలువురు ఉపాధ్యాయులు మా ట్లాడుతూ 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని, నోషనల్ సర్వీస్, పీజీటీలకు జేఎల్ అప్‌గ్రేడేషన్, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

రెండో రోజూ సగం మందే హాజరు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 16 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు ముగిశాయి. రెండో రోజు సోమవారం పరీక్షలు సజావుగా జరిగాయి. జిల్లాలో పేపర్–3 పరీక్షకు 6,078 మందికిగానూ 2,909 మంది హాజరు కాగా 3,169మంది గైర్హా జరయ్యారు. పేపర్ –4 పరీక్షకు 2,907 మంది హాజరుకాగా 3,171 మంది గైర్హాజరయ్యారు. రెండు రోజులుగా పరీక్షలు సజావుగా జరిగాయని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ పరీక్ష తీరును పర్యవేక్షించారు.

భువనగిరిలోని పరీక్షకేంద్రం వద్ద హాల్ టిక్కెట్ చెక్ చేసి అభ్యర్థులను లోపలికి అనుమతిస్తున్న సిబ్బంది

యాసంగికి సాగర్ నీటి విడుదల

- షెడ్యూల్ ప్రకటించిన అధికారులు

నందికొండ, డిసెంబర్ 12 : నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమ కాల్వ కింద సాగు చేసే భూములకు ఈ నెల 15నుంచి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు. యాసంగి సాగుకు నీటి విడుదల షెడ్యూల్‌ను హిల్‌కాలనీ ఇరిగేషన్ అధికారులు సోమవారం ప్రకటించారు. యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ఆయకట్టు చివరి భూములకు నీరు అందే విధంగా రైతులు సహకరించాలని కోరారు.

నీటి విడుదల షెడ్యూల్

- మొదటి విడుత –డిసెంబర్ 15 నుంచి జనవరి 11 వరకు
- రెండో విడుత –జనవరి 19 నుంచి జనవరి 28 వరకు
- మూడో విడుత –ఫిబ్రవరి 5 నుంచి ఫిబ్రవరి 14 వరకు
- నాలుగో విడుత – ఫిబ్రవరి 22 నుంచి మార్చి 25 వరకు
- ఐదో విడుత – మార్చి 11 నుంచి మార్చి 20 వరకు
- ఆరో విడుత – మార్చి 28 నుంచి ఏప్రిల్ 25 వరకు
- ఏడో విడుత –ఏప్రిల్ 25 నుంచి ఏప్రిల్ 23 వరకు

వివాద్ సే విశ్వాస్ స్కీమ్‌పై అవగాహన

నల్లగొండ, డిసెంబర్ 16: ఆదాయపు పన్నుకు సంబంధించి వివాద్ సే విశ్వాస్ స్కీమ్‌పై సోమవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు పన్ను చెల్లింపు దారులకు, ఆడిటర్లకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ ముకాంబికేయన్ ఈ స్కీమ్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ స్కీమ్ ఈ ఏడాది అక్టోబర్‌లో అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కిరణ్, లింగబత్తుల మోహన్, ఆకాశ్, రమణ పాల్గొన్నారు.

కనగల్ పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

మాజీ సర్పంచుల చలో అసెంబ్లీ భగ్నం

- అడుగడుగునా అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఏడాదైనా పెండింగ్ బిల్లులు ఇవ్వట్లేదని మాజీ సర్పంచుల ఆవేదన
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు

నల్లగొండ, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన పేరుతో సంబురాలు చేసుకుంటుందే తప్ప అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన తమకు మాత్రం బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం మాజీ సర్పంచులు చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాంతో పోలీసులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారిని వెళ్లనివ్వకుండా ఎక్కడికక్కడ అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1740గ్రామ పంచాయతీలు ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు ఖర్చు చేశారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర పనులకు సుమారు రూ.100కోట్ల మేరకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినట్లు సర్పంచుల ఆవేదన. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలుత బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి, తమకు ఏడాదిగా ఇవ్వడం లేదని, దాంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వాన్ని పలుమార్లు మాజీ సర్పంచులు వేడుకున్నారు.

అయినా సర్కార్ స్పందించకపోవడంతో చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా అక్కడికి వెళ్లకుండా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుతో విడుదల చేశారు.

నల్లగొండలో డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

రామగిరి, డిసెంబర్ 16 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి ఈ నెల 17న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డితోపాటు తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సీఐటీయూ నాయకులు పోలె సత్యనారాయణ, అద్దంకి నరసింహ, చింత సంగీత, దమయంతి తదితరులు పాల్గొన్నారు.